క్లుప్తంగా

నేడు పన్నుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: ఈ ఆర్థిక సంవత్సరం గడువు ఆదివారంతో ముగియనున్నందున ఇంటి పన్నులు, నీటి కుళాయి, ఇతర పన్నులను మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం రోజున స్వీకరించబడునని, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటి పన్నుల వడ్డీపై 90శాతం వడ్డీమాఫీని ప్రభుత్వం కల్పించిందని, ఇది కూడా ఆదివారంతో ముగియనుందని, పన్నులు చెల్లించని వారు వెంటనే మున్సిపల్ కార్యాలయంలో గానీ, బిల్ కలెక్టర్లకు గానీ, ఆన్‌లైన్ ద్వారా చెల్లించి, పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కొనసాగుతున్న పట్నాలు



వేడుకల్లో ఒగ్గు కళాకారుల ప్రదర్శనలు

దండేపల్లి: మండల కేంద్రంలోని శ్రీమాల్లాం మల్లన్న ఆలయంలో పట్నాల వేడుకలు వైభవోపేతంగా సాగుతున్నాయి. శనివారం ఒగ్గు కళాకారులు ఆలయం నుంచి డోలు వాయిద్యాలతో వెళ్లి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాల్లో యాదవ కులస్తులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

జన్నారం: మండలంలోని చింతగూడ గ్రామంలో శనివారం నల్ల పోచమ్మ బోనాలు ఘనంగా సమర్పించారు. డప్పు చప్పుళ్లతో మహిళలు బోనాలను ఎత్తుకుని ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. గ్రామానికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున బోనాల పండుగలో పాల్గొన్నారు.

రైతు మద్దతు దీక్షకు బీఆర్‌ఎస్ నాయకులు

చెన్నూర్: పెద్దపల్లి బీఆర్‌ఎస్ కార్యాలయంలో రైతులకు మద్దతుగా పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మంచిర్యాల జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బాల్క సుమన్ తలపెట్టిన 36గంటల నిరసన దీక్షకు మద్దతుగా చెన్నూర్ పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో చెన్నూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, బీఆర్‌ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా, కౌన్సిలర్లు రెవెల్లి మహేశ్, తుమ్మ రమేశ్, జగన్నాధుల శ్రీనివాస్, సాధనబోయిన కృష్ణ, జడ్పీ కోఆప్షన్ సభ్యులు అజ్గర్‌అలీ, సురేశ్‌రెడ్డి, నాయిని సతీశ్, సాంబగౌడ్‌లు ఉన్నారు.

గ్రంథాలయ సేవలు వినియోగించుకోవాలి

లక్సెట్టిపేట: ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని గెస్ట్ హౌస్‌లో కొనసాగుతున్న గ్రంథాలయం సేవలను పాఠకులు వినియోగించుకోవాలని గ్రంథాలయ ఇన్‌చార్జి రమేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు పోటీ పరీక్షలు కొనసాగుతున్నందునా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గ్రంథాలయం తెరిచి ఉంటుందన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



పంపిణీ చేస్తున్న సైదులు, ఉస్మాన్

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) కళాశాలలో విద్యార్థులకు శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని తాజ్‌బాబా సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగను పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్ష రాసి పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చిన విద్యార్థులకు సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, తాజ్ బాబాసేవ సమితి నిర్వాహకుడు ఉస్మాన్ తదితరులు గ్లాసుల్లో మజ్జిగను పోసి అందజేశారు. ఎర్రటెండలో దాహార్తిని తీర్చేందుకు మజ్జిగను అందజేసిన నిర్వాహకులను పలువురు అభినందించారు.

ఇంటింటా బీజేపీ ప్రచారం

చెన్నూర్: పట్టణంలో బీజేపీ పెద్దపల్లి అభ్యర్థి గోమాస శ్రీనివాస్ గెలుపు కోసం బీజేపీ నాయకులు శనివారం ఇంటింటా ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కోకన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, బెల్లంకొండ మల్లారెడ్డి, కొండపాక చారి, సంజయ్‌కుమార్, తుమ్మ శ్రీపాల్, రాపర్తి వెంకటేశ్వర్, వంశీగౌడ్ పాల్గొన్నారు.

పన్ను వసూళ్లకు నేడే ఆఖరు..!



నస్పూర్: రశీదు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సతీశ్

- లక్ష్యం చేరని మున్సిపాలిటీలు
- జిల్లాలో మొదటి స్థానంలో లక్సెట్టిపేట
- చివరి స్థానంలో చెన్నూర్

నస్పూర్: జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో ఏ ఒక్క మున్సిపాలిటీ ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను వసూళ్లలో నిర్దేశిత లక్ష్యం వంద శాతం చేరుకోవడంలో విఫలమయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను వసూళ్లలో నిర్దేశిత లక్ష్యంలో ఈ నెల 29వరకు సాధించిన వసూళ్లలో లక్సెట్టిపేట మున్సిపాలిటీ 86.60శాతంతో ముందు వరుసలో నిలువగా, చెన్నూర్ మున్సిపాలిటీ 55.06శాతంతో చివరి స్థానంలో నిలిచింది. జిల్లాలోని ఏ మున్సిపాలిటీ కూడా నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యం అని స్పష్టం అవుతోంది. నస్పూర్‌లో నిర్దేశిత లక్ష్యం రూ.4.83 కోట్లు కాగా వసూళయ్యింది రూ.2.78కోట్లు.

నస్పూర్‌లో సింగరేణి సహకారం లేకపోవడమే కారణమా..?

ఆస్తిపన్ను వసూళ్లలో లక్ష్యాన్ని చేరుకోకపోవడానికి సింగరేణి యాజమాన్యమే కారణమా అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ పరిధిలో సింగరేణికి సంబంధించిన పలు గనులు, కార్యాలయాలు, కార్మికులకు కేటాయించిన కంపెనీ క్వార్టర్లు, ఫంక్షన్ హాల్స్, స్కూల్స్, కాలేజీలు ఉన్నాయి. వీటికి గాను మున్సిపాలిటీకి ఆస్తి పన్నుగా రూ.1.6కోట్లు చెల్లించాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. కాగా సింగరేణి సంస్థ మున్సిపాలిటీకి ప్రతీ ఏడాదీ కేవలం రూ.50లక్షలు మాత్రమే చెల్లిస్తూ వస్తున్నారు. దీంతో మున్సిపాలిటీ అధికారులు తాము నిర్దేశించిన ఆస్తిపన్ను లక్ష్యం చేరుకోవడం లేదని పలువురు మున్సిపల్ అధికారులు వాపోతున్నారు.

లక్ష్య సాధనకు కృషి చేస్తున్నాం

ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను నిర్దేశిత లక్ష్యాలను సాధించడానికి కృషి చేస్తున్నాం. సింగరేణి యాజమాన్యం వారి నిర్దేశిత లక్ష్యం రూ.1.56కోట్లకు గాను కేవలం రూ.50లక్షలు చెల్లించింది. ఇంకా రూ.1.6కోట్లు చెల్లించాల్సి ఉంది. మేము సింగరేణి అధికారులతో చర్చిస్తున్నాం. స్థానిక సింగరేణి అధికారులు సింగరేణి ఉన్నతాధికారులతో చర్చించి మొత్తం ఆస్తి పన్ను చెల్లింపుపై నిర్ణయం తీసుకుంటాం.

- సీహెచ్ సతీశ్, మున్సిపల్ కమిషనర్, నస్పూర్

జిల్లాలో మున్సిపాలిటీలు సాధించిన లక్ష్యాలు

మున్సిపాలిటీ	డిమాండ్(రూ.కోట్లలో)	కలెక్షన్	బ్యాలెన్స్	శాతం
లక్సెట్టిపేట	1.44	1.25	0.19	86.60
క్యాతన్‌పల్లి	4.10	3.27	0.83	79.85
మందమర్రి	2.13	1.46	0.67	68.62
బెల్లంపల్లి	3.46	2.29	1.17	66.17
మంచిర్యాల	17.48	10.84	6.64	62.03
నస్పూర్	4.83	2.77	2.06	57.39
చెన్నూర్	2.45	1.36	1.09	55.61

ఈత సరదా.. కారాదు విషాదం

- జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు



బావిలో పై నుంచి దూకుతున్న యువకులు(ఫైల్)

దండేపల్లి: ఏటా వేసవిలో యువత, చిన్నారులు వేడి నుంచి ఉపశమనం పొందేందుకు కాల్వలు, చెరువులు, వ్యవసాయ బావుల్లో స్నానాలు చేసేందుకు వెళ్తుంటారు. సరదాగా వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడం కోసం ఈత వచ్చిన వారు, రానివారు నేర్చుకుందామని చెరువులు, వ్యవసాయ బావులకు వెళ్లి ఆయా సందర్భాల్లో ప్రమాదాల బారిన పడి కుటుంబాలకు తీరని శోకం మిగులుస్తున్నారు. ఇలా ఈత సరదాలు విషాదం నింపిన ఘటనలు జిల్లాలో అక్కడక్కడా చోటు చేసుకున్నాయి. ఇటీవల హోలీ పండగ రోజున దండేపల్లి మండలం తానిమడుగు సమీపంలో గూడెం ఎత్తిపోతల డెలివరీ పాయింట్ వద్ద కడెం ప్రధాన కాల్వలో మిత్రులతో కలిసి సరదాగా స్నానం చేసేందుకు దిగి ఇంటర్ విద్యార్థి నీటమునిగి చనిపోయాడు. ఈతకు వెళ్లే యువకులు, చిన్నారులు కనీస జాగ్రత్తలు పాటించి సరదా సమయాన్ని విషాదం కాకుండా చూసుకోవాలని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు. కనీస సూచనలు పాటిస్తే ప్రమాదాల నుంచి బయటపడొచ్చు అంటున్నారు.

పాటించాల్సిన సూచనలు..

- 15–16ఏళ్ల లోపు, బాల బాలికలు అంతకంటే చిన్నవయస్సు వారు తల్లిదండ్రులు, పెద్ద వారు తోడు లేకుండా చెరువులు, కుంటలు, వాగులు, వ్యవసాయ బావుల వద్దకు స్నానాలకు వెళ్లకుండా చూడాలి.
- ఈత వచ్చిన వారి పర్యవేక్షణలో ఈత నేర్చుకోవడం మంచిది.
- కొత్తగా ఈత నేర్చుకునేవారు మోకాలు లోతు నీటిలో తల్లిదండ్రులు, ఈత వచ్చిన వారి పర్యవేక్షణలో నేర్చుకోవాలి.
- ఈత నేర్చుకునేటప్పుడు వినియోగించే గాలి ట్యూబులు, తదితర సామగ్రి తరచూ పరిశీలించుకుంటూ సరిచేసుకోవాలి.
- ఈత పూర్తిగా వచ్చిన తర్వాతే ఒంటరిగా ఈత కొట్టేందుకు వెళ్లాలి.
- మత్తు పదార్థాలు, మద్యం తాగి ఈత కొట్టడం మంచిదికాదు.
- ఈత కొట్టే సమయంలో సాహసాలు చేయరాదు.
- చెరువులు, కుంటల్లో గుర్తించ రాకుండ కందకాలు ఉంటాయి, వాటిని గుర్తించి తగిన విధంగా ఈత కొట్టాలి.
- అధిక లోతు నీటిలోకి వెళ్లి సాహసాలు చేయొద్దు.
- కాల్వల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. ఈత రాని వారు అలాంటి నీటిల్లో దిగద్దు.

జాగ్రత్తలు పాటించాలి..

ఈతకు వెళ్లే యువకులు, చిన్నారులు, జాగ్రత్తలు పాటించాలి. గ్రామాల్లో చెరువులు, వ్యవసాయ బావుల్లో ఈతకు వెళ్లే వారు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలి. ఈత నేర్చుకునే వారు, ఈత వచ్చిన వారితో కలిసి, వారి పర్యవేక్షణలో గాలి ట్యూబులు ధరించి నేర్చుకోవాలి. లోతు నీళ్లలో కాకుండా మోకాలి లోతు నీళ్లలో మాత్రమే నేర్చుకోవాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలకు తగిన అవగాహన కల్పించాలి. లేదంటే వెంట వెళ్లడం మంచిది. ఈత రాని వారు నీటి ప్రవాహ వేగం ఎక్కువ ఉన్న నీటిలో దిగద్దు.

- స్వరూప్‌రాజ్, ఎస్సై, దండేపల్లి

బాల్యవివాహాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మౌనిక

జన్నారం: బాల్య వివాహాలు జరగకుండా అంగన్‌వాడీ టీచర్లు అప్రమత్తంగా ఉండాలని, బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్టు మౌనిక, ఫైనాన్సిల్ లిటరసీ లిప్సికలు అన్నారు. మండలంలోని కిష్టాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలోని సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లకు శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బేటీ పడావో, బేటీ బచావో పథకం, లింగ వివక్ష, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్, సైబర్ క్రైం, పోక్సో చట్టం, సుకన్య సంవృద్ధి యోజన, మిషన్ వాత్సల్య తదితర మహిళ సాధికారిత పథకాల గురించి వివరించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పద్మ, టీచర్లు పాల్గొన్నారు.

బుధాకుర్థులో ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బుధాకుర్థు గ్రామంలోని శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయంలో ధ్వజ, శిఖర, యంత్ర, మూర్తి స్థిర ప్రతిష్ఠాయాగ మహోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మొదటిరోజు తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, ఋత్విగ్వర్ణము, దీక్షాధారణ, పంచగవ్యమేలన, అఖండ జ్యోతి స్థాపన, కుండ సంస్కార పూర్వక అగ్నిప్రతిష్ఠా, జలాధివాసము, రాజోపచర పూజ , ప్రత్యేక హోమం చేపట్టారు. జై శ్రీరామ్, జై హనుమాన్ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రెండు రోజుల పాటు పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో హనుమాన్ మాలధారులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గుడిపేటవాసి దొమ్మటి రవికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న రవి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట-నంనూర్‌కు చెందిన దొమ్మటి రవి గౌరవ డాక్టరేట్ అందుకున్నాడు. పురగిరి క్షత్రియ సమాజానికి సంబంధించి ప్రొఫెసర్ టీ.వీ.గోపాలాచారి పర్యవేక్షణలో సామాజిక శాస్త్ర అధ్యయనం చేసిన రవి ఆ ప్రాజెక్ట్‌ను ఉస్మానియా యూనివర్సిటీలో అందజేసి యూనివర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ కళాశాల సోషియాలజీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ గణేశ్, సోషియాలజీ విభాగం బీఓఎస్ ప్రొఫెసర్ విష్ణుదేవ్, సోషియాలజీ విభాగం ప్రొఫెసర్లు టీ.వీ.గోపాల్, రాంషేఫర్డ్ చేతుల మీదుగా ఉస్మానియా యూనివర్సిటీలో దొమ్మటి రవి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. రవి తల్లిదండ్రులు శ్యామల-రాంచందర్‌లు కాగా తండ్రి వ్యవసాయం చేస్తుండగా రవి ఎంఎస్సీ ఫిజిక్స్, ఎం.ఏ.సోషియాలజీ చదువులు పూర్తి చేసి పురగిరి క్షత్రియ సమాజంపై విస్తృతస్థాయి పరిశోధన చేసినందుకు గాను గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

బీజేపీ నూతన మండలాధ్యక్షుల ఎంపిక



నియామక పత్రం అందుకుంటున్న మండలాధ్యక్షులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లాకు చెందిన జన్నారం, భీమారం, బెల్లంపల్లి పట్టణ నూతన బీజేపీ పార్టీ అధ్యక్షులను ఆ పార్టీ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి చేతుల మీదుగా జిల్లా కార్యాలయంలో నియామకపత్రాలను అందించారు. బెల్లంపల్లి పట్టణ అధ్యక్షురాలిగా దార కళ్యాణి, భీమారం మండల అధ్యక్షులుగా బోరుకుంట శంకర్, జన్నారం మండల అధ్యక్షుడిగా గుండవరపు మధుసూదన్‌రావులను నియమించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రజనీశ్ జైన్, దుర్గం అశోక్, పట్టి వెంకటకృష్ణ, జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, చెన్నూరు అసెంబ్లీ కన్వీనర్ అక్కల రమేశ్, మంచిర్యాల అసెంబ్లీ కన్వీనర్ తోట మల్లిఖార్జున్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు బద్రినాయక్ పాల్గొన్నారు.

జేబీఎస్‌డీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షులుగా శీలం

జైపూర్: మండలంలోని గంగిపల్లికి చెందిన మాజీ వైఎస్ ఎంపీపీ శీలం వెంకటేశ్‌ను జై భీమ్ సైనిక్ దళ్(జేబీఎస్‌డీ) చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షులుగా నియమించినట్లుగా జిల్లా అధ్యక్షుడు ఎర్రోల్ల నరేశ్ శనివారం ప్రకటించారు. జై భీమ్ సైనిక్ దళ్ వ్యవస్థాపక అధ్యక్షులు అద్దంకి దయాకర్, రాష్ట్ర కన్వీనర్ ఆసాది పురుషోత్తం నేతృత్వంలో జై భీమ్ సైనిక్ దళ్ పనిచేస్తుందని, వారి ఆదేశాల మేరకు చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షులుగా శీలం వెంకటేశ్‌ను నియమించినట్లుగా ఆయన పేర్కొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం



రిటైర్డ్ ఉద్యోగి కృష్ణను సన్మానిస్తున్న మేనేజర్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 6గనిలో రిటైర్డ్ అయిన దుర్గం కృష్ణ అనే కోల్‌కట్టర్ కార్మికుడిని శనివారం గనిపై ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. గని మేనేజర్ ఈ.తిరుపతి రిటైర్డ్ అయిన కృష్ణను శాలువాతో సత్కరించారు. ఆయనకు కంపెనీ నుంచి చెల్లించే టెర్మినల్ బెనిఫిట్స్ ఆర్డర్ కాపీని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణతో పనిచేసి తన సర్వీసు పూర్తి చేశారన్నారు. రిటైర్మెంట్ సొమ్మును భద్రంగా దాచుకోవాలని సూచించారు. శేష జీవితాన్ని సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గని రక్షణ అధికారి కాదాసి శ్రీనివాస్, డిప్యూటీ మేనేజర్ మరి కొమురయ్య, ఫిట్ ఇంజనీర్ శ్యాం కుమార్, సంక్షేమ అధికారి సునీల్ కుమార్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఫిట్ సెక్రెటరీ సంఘం సదానందం తదితరులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడిగా జీవన్

దండేపల్లి: జై భీమ్ సైనిక్‌దళ్ దండేపల్లి మండల అధ్యక్షుడిగా మండలంలోని మేదరిపేటకు చెందిన రాపల్లి జీవన్ నియమితులయ్యారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి దయాకర్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల నరేశ్ జీవన్‌కు శనివారం నియామకపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటి తొట్లు



లంబడిపల్లిలో నిరుపయోగంగా..

చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబడిపల్లి, కన్నెపల్లి గ్రామాల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు గాను ఉపాధిహామీ పథకంలో వేలు వెచ్చించి నిర్మించిన నీటి తొట్లలో నీరు లేకుండా నిరుపయోగంగా మారాయి. నీటి తొట్టిలు నిర్మించారు కానీ అందులోకి నీటిని పంపించే ఏర్పాటు చేయకపోవడంతో అవి వృథాగా పడి ఉన్నాయి. అసలే వేసవి కాలం పశువులకు తాగునీరు దొరక్కా అల్లాడుతున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకొని నీటి తొట్టిలోకి నీటిని పంపించే ఏర్పాటు చేసి పశువుల దాహార్తి తీర్చాలని రైతులు కోరుతున్నారు.

తొట్టిలో నీటిని నింపండి..!



భీమారం: మండల కేంద్రంలోని లంబాడీతాండాలో పశువుల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన తొట్టిలో నీటిని నింపాలని స్థానికులు కోరుతున్నారు. దాదాపు 10ఏళ్ల క్రితం వాటర్‌షెడ్ నిధులతో మండల కేంద్రంలోని పలు చోట్ల పశువులకు నీరు అందించేందుకు వేలాది రూపాయలు ఖర్చుచేసి, ప్రభుత్వం నీటి తొట్టిలను నిర్మించింది. ఈ మేరకు కొన్నేళ్ల పాటు నీటిని నింపిన గ్రామపంచాయతీ అధికారులు రానురాను మరిచిపోయారు. వేసవి ఎండలు దంచికొడుతున్న ఈ సమయంలో నీటిని నింపితే స్థానికంగా ఉండే పశువులకు ఎంతో మేలు జరుగుతుందని పలువురు అంటున్నారు.

ఉత్సాహంగా 'రన్‌ఫర్ జీసస్'



ఆర్‌కేపీలో రన్‌లో పాల్గొన్న క్రైస్తవులు



లక్సెట్టిపేట: రన్ ఫర్ జీసస్ లో పాల్గొన్న క్రైస్తవులు

రామకృష్ణాపూర్: పట్టణంలో శనివారం నిర్వహించిన రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. స్థానిక రాజీవ్‌చౌక్‌లో ప్రారంభమైన రన్‌ను పట్టణ ఎస్సై రాజశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఏసుక్రీస్తు సిలువ మరణం పొంది మూడో రోజున సజీవుడిగా తిరిగిలేచిన శుభవార్తను ప్రజలకు తెలియజేసేందుకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రన్‌ఫర్ జీసస్ కన్వీనర్ డొక్కల డేవిడ్, పాస్టర్లు జాషువా, సామ్యూల్‌రాజ్, దేవానందం, జాషువా తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మండలంలోని క్రైస్తవులు శనివారం రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీఎస్ఐ చర్చి ఫాదర్ డెవిల్ పాల్ ప్రార్థన చేసి కీర్తనలు పాడి జెండా ఊపి రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు క్రైస్తవులు పెద్ద మొత్తంగా హాజరై పాటలుపాడుతూ జీసస్ నినాదాలు చేస్తూ వెళ్లారు. కార్యక్రమంలో క్రైస్తవులు, పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు



డాక్టర్స్‌ను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: ప్రపంచ డాక్టర్స్ డే దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో రెడ్‌క్రాస్ సభ్యులు శనివారం వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రక్తనిధి కేంద్ర మెడికల్ ఆఫీసర్లుగా అమూల్యమైన సేవలందిస్తున్న డాక్టర్ ప్రియాంక, డాక్టర్ వంశీ, డాక్టర్ ప్రశాంత్‌లను సన్మానించి, మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ కె.భాస్కర్ రెడ్డి, స్టేట్ మేనేజింగ్ కమిటీ మెంబర్ వి.మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ బొప్పు సతీశ్, కార్యదర్శి చందూరి మహేందర్, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కే.సంతోశ్ కుమార్, పవన్ తివారి, ఎడ్ల కిషన్, చంద్రమోహన్ గౌడ్, రక్తనిధి సిబ్బంది కే.మాదవి, సూపర్‌వైజర్ రాజేశ్, మౌనిక, సౌందర్య, మల్లీశ్వరి, శైలజ, లక్ష్మి, మణికంఠ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన 'పది' పరీక్షలు



మందమర్రిలో...



దండేపల్లి: పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



పరీక్ష ముగించుకుని ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/దండేపల్లి/నెన్నెల/మందమర్రిరూరల్/భీమారం/తాండూర్: పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ సంబురాల్లో మునిగిపోయారు. పరీక్ష కేంద్రం ఆవరణలో పరీక్షలు ఎలా రాశావ్ అంటూ చర్చించుకున్నారు. ఒకరికొకరూ చిరునామాలు, మొబైల్ నంబర్లు తీసుకుంటూ వీడ్కోలు చెప్పుకున్నారు. హాస్టళ్లలోని విద్యార్థులు వారివారి వస్తువులను తీసుకుని ఆనందోత్సాహాల మధ్య ఇళ్లకు తరలివెళ్లారు.